
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 27.0 | కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY 5




నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
మంగళవారం 10 డిసెంబరు 2024

సొంతిల్లు కలగానే!

● సామాన్యుడికి భారమైన నిర్మాణ వ్యయం





అయిజ పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇల్లు



● అయిదేళ్లలో అమాంతం పెరిగిన నిర్మాణ ధరలు

● 120 శాతం పెరిగిన ఇసుక ధరలు, 55 శాతం పెరిగిన సిమెంట్ ధరలు

● 2019-2024 మధ్యలో 80 శాతం పెరిగిన స్టీలు, ఇటుక ధరలు

● ఇతర మెటీరియల్, కూలీల ఖర్చులు సైతం భారీగానే పెరుగుదల

● మధ్యతరగతి వారి ఇళ్ల నిర్మాణాలపై రూ.15 లక్షల వరకు పెరిగిన ఆర్థిక భారం

- వివరాలు 6వ పేజీలో...

సామాన్యుడికి సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సొంతింటి ఆశలు వదులుకోవాల్సి వస్తోంది. 2019లో ఉన్న ఇంటి నిర్మాణ వ్యయంతో పోల్చితే 2024లో ఉన్న ధరలు ఆకాశాన్నంటాయి. సిమెంట్ మొదలుకొని స్టీల్, ఇసుక, ఇటుక ధరలు ఈ ఐదేళ్లలో మూడింతలయ్యాయి. దీంతో ప్రజలు ఇక ఇంటి నిర్మాణం కంటే అద్దె ఇంట్లోనే ఉంటే బెటర్ అనే పరిస్థితికి వచ్చేస్తున్నారు. ఎంతైనా సొంత ఇల్లు ఉంటే బాగుండు అన్న ఆశ మాత్రం సగటు మనిషిని వీడకపోవడం గమనార్హం. - అయిజ టౌన్, ఆంధ్రజ్యోతి

సామాన్యుడు నిర్మించలేడు



పెరిగిన మెటీరియల్ ధరలు, కూలీల ఖర్చులు చూస్తే సామాన్యుడు సొంతింటిని నిర్మించుకోలేని స్థితి. అయిదేళ్లకు స్టీల్, ఇటుక, ఇసుక, సిమెంట్ ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. ఒక్కోసారి వెయ్యి రూపాయలు చెల్లించినా మేస్త్రీలు పనికి రావడం లేదు. వారూ కూలీలను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

- బాషా, భరత్‌నగర్, అయిజ పట్టణం

కొడుకే ఆమె ప్రాణం

● మానసిక ఎదుగుదల లేని కుమారుడు

● 30 ఏళ్లుగా సేవ చేస్తున్న తల్లి

తొలిచూలులో పుట్టిన కుమారుడు మానసికంగా ఎదగలేదు. ఆ మనో వేదనతో కట్టుకున్న భర్త మృతి చెందాడు. అయినా ఆమె కుంగిపోలేదు. కన్నీటిని దిగమింగి, కష్టాలకు ఎదురీదుతోంది. 30 ఏళ్లుగా అన్నీ తానే అయి కొడుకును కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. అయిజ పట్టణం లోని కుమతంపేట కాలనీకి చెందిన అయ్యమ్మ దీన గాథ ఇది..

- అయిజ టౌన్

వివరాలు 7వ పేజీలో...



కొడుక్కి అంగి తొడిగిస్తున్న తల్లి

వైభవంగా కొనసాగుతోన్న

బ్రహ్మోత్సవాలు

హోమాలలో పాల్గొన్న హంపి, మంత్రాలయం పూర్వ పీఠాధిపతులు 6



మహారుద్రయాగం పూర్ణాహుతిలో పాల్గొన్న హంపి పీఠాధిపతులు

చురుగ్గా అభివృద్ధి పనులు

● జోగుళాంబ రైల్వే హాల్ట్ వద్ద రూ.ఆరున్నర కోట్ల వ్యయంతో వర్క్స్

● తీరనున్న ప్రయాణికుల కష్టాలు

ఉండవల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏకైక శక్తిపీఠం జోగుళాంబ అమ్మవారి పేరు మీద ఉండవల్లి మండలంలో ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ దినదినాభివృద్ధి చెందుతోంది. 2006లో పునఃప్రారంభమైన ఈ జోగుళాంబ రైల్వే స్టేషన్‌కు ఏటా ప్రయాణికుల ఆదరణ పెరుగుతోంది. ఒకప్పుడు కనీస వసతులు లేని స్టేషన్ వద్ద ప్రస్తుతం ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. అందుకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. దాంతో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అలంపూర్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గల చాలా గ్రామాల ప్రజలకు ఈ స్టేషన్ ఏర్పాటుతో ఎంతో (మిగతా 6లో)



నిర్మాణంలో హైలెవల్ ప్లాట్‌ఫాం

అమ్మకానికి వచ్చిన

ఇతర రాష్ట్రాల ధాన్యం

● కొత్తకోటలో పట్టుకున్న రైతులు..

కొత్తకోట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వరి ధాన్యం కొత్తకోటలో అమ్మకానికి వచ్చిందనే సంఘటన కలకలం సృష్టించింది. తెలంగాణ ప్రభుత్వం వరి సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తుంది. దాన్ని సొమ్ము చేసుకోవడం కోసం కొందరు దళారులు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇక్కడికి తీసుక రాగా కొందరు రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైతుల ఫిర్యాదును జిల్లా సివిల్ సప్లయ్ అధికారులకు పోలీసులు నివేదించారు. దీనిపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారిని వివరణ కోరగా విచారణ చేస్తున్నమన్నారు. కాగా ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యం బోనస్ కోసం ఇక్కడ అమ్మకానికి తీసుకొచ్చారన్న విషయం తెలుసుకున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో నాటవెళ్లి కొనుగోలు కేంద్రానికి చేరుకొని ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని తీసుకొచ్చిన దళారులపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యం పరిశీలించిన వారిలో సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, బీచుపల్లి యాదవ్, శ్రీనివాసులు, మాసన్న గ్రామ రైతులు ఉన్నారు.



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కేసీఆర్ పోరాటం వల్లే

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

● 'దీక్షా దివస్'లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి 7

బస్సులో ల్యాప్‌టాప్‌ను మరిచిన ప్రయాణికుడు 7

యాగంటిలో దంపతుల ఆత్మహత్యాయత్నం 6



నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్యాభర్తలు

జోగుళాంబ ఆలయానికి

భారీగా ఆదాయం

అలంపూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అలంపూరు ఐదవ శక్తి పీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు సహాయ కమిషనర్, దేవాదాయ శాఖ, మహబూబ్ నగర్ మదనేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. గత 110 రోజుల హుండీ ఆదాయం 58,66,623 రూపాయల ఆదాయం రాగా, ప్రస్తుత 150 రోజుల హుండీ లెక్కింపులో అమ్మ వారి హుండీ ద్వారా రూ. 87,02,578, స్వామి వారి హుండీ 18,63,642, అన్నదాన సత్రం 38,216 ద్వారా మొత్తం కలిపి ఆలయానికి భారీగా 1,06,04,436 రూపాయల ఆదాయం సమకూరింది.

అదేవిధంగా, విదేశీ కరెన్సీ యుఎస్ డాలర్స్ 17, ఆస్ట్రేలియా కరెన్సీ ఐదు, స్వీడన్ కరెన్సీ 1000, మిశ్రమ బంగారు 61 గ్రాములు, మిశ్రమ వెండి 513 గ్రాములు వచ్చింది. ఈ కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ బి.నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలు జగన్ మోహన్ నాయుడు, నాగశిరోమణి, విశ్వనాథ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, గోపాల్, జి.వెంకటేశ్వర్లు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు, ఎక్స్ అఫిషియో సభ్యుడు డి.ఆనంద్ శర్మ, అర్చకులు, సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు, గద్వాల, కొత్తకోట, కర్నూలు, హైదరాబాదుకు చెందిన వివిధ సేవా సంస్థల వారు పాల్గొన్నారు.



ఆలయం హుండీని లెక్కిస్తున్న సేవా సంస్థల మహిళలు

సీఎం కప్-2024 కరపత్రం విడుదల

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్-2024 క్రీడలను జయప్రదం చేయాలని అదనపు కలెక్టర్లు కె.సీతారామారావు, దేవ సహాయం పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎం కప్ పోస్టర్, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కె.సీతారామారావు మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో ఆరు విభాగాల్లో, జిల్లా స్థాయిలో 20 విభాగాల్లో, రాష్ట్ర స్థాయిలో 36 విభాగాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో ఈ నెల 7 నుంచి ప్రారంభమైనాయని, 10 నుంచి 12 వరకు మండల స్థాయి లో, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతున్నాయన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించి సీఎం కప్ గెలువాలని ఆకాంక్షించారు. జిల్లా భూసేకరణ అధికారిణి బి.అరుణారెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి జీవీ రమేష్, జడ్పీ డిప్యూటీ సీఈవో జీగోపాల్, జిల్లా పంచాయతీ అధికారి రాంమ్మోహన్‌రావు, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో సీఎం కప్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

● హోమాలలో పాల్గొన్న హంపి, మంత్రాలయం పూర్వ పీఠాధిపతులు



మంత్రాలయం పూర్వ పీఠాధిపతులకు స్వాగతం పలుకుతున్న మల్దకల్ ఆలయ అధికారులు

మల్దకల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో వెలసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాలయ పరిసరాలు హరినామ స్మరణతో మారుమోగుతున్నాయి. ఇందులో భాగంగా మల్దకల్ లక్ష్మీవేంకటేశ్వర స్వామిని ఆదివారం రాత్రి హంపి విరూపాక్ష పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య విద్యారణ్య భారతి స్వామి దర్శించుకున్నారు. దేవాలయ అధికారులు భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో పలు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించడ్డాయి. ఆదిశిలా క్షేత్రమైన మల్దకల్‌లో దేవాలయంలో క్షేత్రపాలకుడు, ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన మహారుద్రయాగం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం పీఠాధిపతుల చేతులమీదుగా పండితులకు పలువురికి సత్కారం చేసి ఆశీర్వచనాలు అందజేశారు.

మంత్రాలయం పూర్వ పీఠాధిపతులకు ఘన స్వాగతం

మల్దకల్ మండల కేంద్రంలో కొనసాగుతున్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో సోమవారం మంత్రాలయం పూర్వ పీఠాధిపతులు సువిదేంద్ర తీర్థ స్వామి పాల్గొన్నారు. అంతకుముందు ఆయనకు ఆలయ అధికారులు భక్తులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. సోమవారం పూర్వ పీఠాధిపతుల కరకమలములచే భద్రాద్రి సీతారామ, లక్ష్మణ, మధ్వాచార్యులు, భీమసేన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగాయి. దేవాలయంలో జరిగిన మహాకుంభాభిషేకం, కలశ ప్రతిష్ఠలకు సంబంధించిన హోమం కార్యక్రమంలో పీఠాధిపతులు పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో శ్రీమూలరాముల సంస్థాన పూజా కార్యక్రమం నిర్వహించి దశవిధ హారతులు సమర్పించారు. అనంతరం సీతారామచంద్ర లక్ష్మణ విగ్రహ దాత పద్మారెడ్డి, బుచ్చిరెడ్డి, మధ్వాచారి విగ్రహదాత దీపిక, భీమసేనుల విగ్రహదాత సౌమేంద్రకౌసిక్‌లను పీఠాధిపతులు ఆశీర్వదించారు.

యాగంటిలో దంపతుల ఆత్మహత్యాయత్నం

అయిజ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పుణ్యక్షేత్రమైన ఏపీలోని యాగంటి పరిసరాలలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన భార్గవ్, పల్లవి దంపతులు సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య ఉన్న వారిని గమనించిన అయ్యప్ప మాలధారులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం భార్య భర్తలు ఇద్దరూ అక్కడ మెరుగైన వైద్యం పొందుతున్నారు. ప్రస్తుతం ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయటపడ్డారు. ఈ విషయమై బనగానపల్లి ఎస్‌ఐ దుగ్గిరెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ క్షేమంగానే ఉన్నారని చెప్పారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు. అయిజ పట్టణానికి చెందిన ఈ దంపతులు మూడు రోజుల క్రితం పల్లివి పుట్టినిల్లు అయిన నాగర్‌కర్నూలు జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రానికి భర్తతో కలిసి వెళ్ళింది. తన కూతురిని తన తల్లి దగ్గరే వదిలి భర్తతో కలిసి కొల్లాపూర్ సమీపంలోని సోమశిల పుణ్యక్షేత్రానికి వెళ్ళి వస్తామని చెప్పినట్లు సమాచారం. తీరా సోమవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కనిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటంబ సమస్యలు, కలహాలతోనే ఈ సంఘటనకు పాల్పడి ఉంటారని తెలిసింది.

సొంతిల్లు కలగానే!

● సామాన్యుడికి భారమైన నిర్మాణ వ్యయం



ఇంటి నిర్మాణానికి సిమెంట్‌ను ఎద్దుల బండిపై తీసుకువెళుతున్న యజమాని

అయిజ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాన్యుడికి సొంతింటి కల భారమైనట్లుగా కనిపిస్తుంది. కరోనా కంటే ముందు 2019లో ఉన్న ఇంటి నిర్మాణ వ్యయంతో పోల్చితే 2024లో ఉన్న నిర్మాణ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నట్లుగా తెలుస్తుంది. ఇంటి నిర్మాణానికి ఉపయోగించే కూలీల నుంచి ఇతర అన్ని మెటీరియల్ అన్నింటి ధరలకు రెక్కలొచ్చాయి. సిమెంటు, కడ్డీ, స్టీలు, ఇసుక, ఇటుకల ధరలు అయిదేళ్లకు దాదాపు 55 శాతం నుంచి 120 శాతం వరకు పెరిగాయి. దీంతో సామాన్యుడి సొంతిళ్ల నిర్మించుకోవాలంటే అయిదేళ్ల క్రితం అయిన ఖర్చుకు దాదాపు రూ.10 నుంచి రూ.15 లక్షల వరకు అదనంగా ఖర్చుచేస్తే తప్ప సొంతింటి కల తీరే అవకాశం లేదు.

2019 సంవత్సరంలో ఇలా...

120 చదరపు గజాలు గల ఖాళీ స్థలంలో చిన్నపాటి ఇళ్లు నిర్మించుకునేందుకు నిర్మాణానికి కావలసిన ఇసుక ఒక టన్ను రూ. 395 ఉండగా, స్టీలు ధర టన్నుకు రూ. 41,000 ఉండేది. రెండు వేల ఇటుకలు ఉండే ఒక ట్రాక్టర్ ధర రూ.8,500, బస్తా సిమెంట్ రూ.237గా ఉండేది. ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే కూలీల్లో మేస్త్రీలకు రోజుకు రూ.450 ఉండగా, ఇతర పనివారికి రూ.300 ఉండేది. తలుపులు, కిటికీలు, విద్యుత్, బోరు, తదితర మెటీరియల్స్ మొత్తం కలిపి ఒక ఇంటి నిర్మాణానికి రూ. 18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చు అయ్యేది.

2024 సంవత్సరంలో ఇలా....

ఈ ఏడాదిలో సొంతిల్లు నిర్మించుకోవాలనుకున్న వారికి ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. నాలుగు టన్నుల భరువుండే ఒక ట్రాక్టర్ ఇసుక దాదాపు 120 శాతం పెరిగి ఆన్‌లైన్‌లో రూ. 3,500 లు ధర పలుకుతుంది. ప్రైవేటు పరంగా ఎద్దుల బండ్లతో కొంటే రూ.6,500 ఖర్చవుతుంది. క్వింటాలు స్టీలు రూ. 7200 ఉండగా, ట్రాక్టర్ ఇటుక రూ, 15,000 ధర పలుకుతుంది. బస్తా సిమెంట్ ధర 350 కి చేరింది. నెల రోజులు క్రితం అయితే దీని ధర 390 వరకు ఉండేది. ఇంటి నిర్మాణానికి వచ్చే మేస్త్రీకి కూలీ రూ. 800 ఉండగా, ఇతర పనివారికి రూ.600గా ఉంది.

ఇవన్నీ పెట్టుబడులు ఇతర మెటీరియల్ ఖర్చులు కలిపి ఇప్పుడు ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.30 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఖర్చవుతున్నట్లు ఇంటి యజమానులు వాపోతున్నారు.

కూలి వెయ్యికి పెంచితే బాగుండు



మేస్త్రీలకు చెల్లించే కూలీ రూ. 1000 అయితే గిట్టుబాటు అవుతుంది. మాకు కుటుంబ ఖర్చులు పెరిగిపోయాయి. ఉదయం ఆరు గంటలకే పనికి వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లేలోపు ఆరు, ఏడు గంటలవుతుంది. సిమెంట్ పనికి చేతులు, కాళ్ల తూట్లు పడుతున్నాయి. మంటకు రాత్రిళ్లు నిద్రపట్టదు.

– వడ్డె తిరుమలేష్, మేస్త్రీ మడ్డిగుంత కాలనీ, అయిజ పట్టణం

ఫ్రీగా ఉండలేకనే చేస్తున్నాం..



చిన్నప్పటి నుంచి ఇళ్లు కట్టే పనికి అలవాటు పడ్డాం. ఐదేళ్లుగా ఇంటి నిర్మాణ పనుల్లో ఏ మాత్రం లాభాలు రావటం లేదు. చాలామంది మెటీరియల్ కాంట్రాక్ట్ ఇవ్వటంతో మధ్య మధ్యలో ధరలు పెరిగి మాకు నష్టం వస్తుంది. ఇంటి యజమానిని అడిగితే మాట్లాడిన డబ్బులు తప్ప ఒక్క రూపాయి ఎక్కువగా ఇవ్వబోనని చెబుతున్నారు.

– రాజు, కాంట్రాక్టర్, గుర్రంతోట వీధి, అయిజ పట్టణం

చురుగ్గా అభివృద్ధి పనులు



నిర్మాణంలో ఉన్న స్టేషన్ ముఖద్వారం

(మొదటిపేజీ తరువాయి)

సౌకర్యవంతంగా ఉంది. జోగుళాంబ అమ్మవారి దర్శనార్థం రాష్ట్రం నలుమూలల నుంచే కాక పక్కన ఉన్న తెలుగు రాష్ట్రం నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం నిత్యం వస్తుంటారు. ప్రయాణికుల రద్దీ పెరగడం అందుకు తగిన ఆదాయం రావడంతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. జోగుళాంబ హాల్ట్‌ను జోగుళాంబ రైల్వేస్టేషన్‌గా మార్చారు. చిన్నపాటిగా ఉన్న టికెట్ కౌంటర్ గదిని పునర్నిర్మాణం చేసి తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫాం చిన్నదిగా ఉండటంతో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, లైటింగ్ సిస్టం వంటి అసౌకర్యాలను గుర్తించిన అధికారులు స్టేషన్ అభివృద్ధికి సుమారు ఆరున్నర కోట్లతో పనులు ప్రారంభించారు. ప్రధానంగా టికెట్ కౌంటర్ గదిని ఆదునీకరించడం, పార్కింగ్, వెయిటింగ్ హాల్, ఏసీ గదులు, వృద్ధులకు, మహిళకు విధిగా టికెట్ కౌంటర్, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, లైటింగ్ సిస్టం, కంపౌండు వాల్, సర్క్యూలేటింగ్ సిస్టం వంటి పలు అభివృద్ధి పనులను చేపట్టారు. మొదట్లో పనులు ఆలస్యంగా జరిగినా రానురాను అధికారుల పర్యవేక్షణతో వేగవంతంగా జరుగుతున్నాయి. హైలెవల్ ప్లాట్‌ఫాం తయారు కావడంతో వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు రైళ్ల ఎక్కడం, దిగడానికి సౌకర్యవంతం కానుండ డంతో హర్షం వ్యక్త చేస్తున్నారు. మరో మూడు నెలలో పూర్తిస్థాయిలో ప్రయాణికులకు అందుబాటు లోకి రానుంది.



ఆలయ ఆకృతుల పనిలో...

వెంకటాద్రి, చెన్నై ఎగ్మోర్ నిలపాలి

అమ్మవారి దర్శనానికి వచ్చే దూర ప్రాంతం ప్రయాణికులతో పాటు ఈ ప్రాంతపు వాసులు తిరుపతి, బెంగళూర్, చెన్నై వంటి నగరాలకు పుణ్యక్షేత్రాలతో పాటు వ్యాపార, ఉద్యోగ నిమిత్తం కూడా సౌకర్యంగా ఉంటుందని, కావున వెంకటాద్రి, చెన్నై ఎగ్మోర్, యశ్వంత్‌పూర్ ట్రైన్‌లను జోగుళాంబ రైల్వేస్టేషన్‌లో నిలపాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

గతంలో రైల్వే ఉన్నతాధికారులు పర్యటించిన సందర్భాలలో ఉండవల్లి, అలంపూర్ రైతుసంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఆర్వోబీని నిర్మించాలి

ప్రస్తుతం జోగుళాంబ స్టేషన్‌లో పలు అభివృద్ధి పనులు జరగుతున్నాయి. స్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారుగా 30 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఆ సమయంలో లెవల్ క్రాసింగ్ వద్ద గేట్ పడితే నిరీక్షణ తప్పదు. సమస్య రానురాను తీవ్రతరం అవుతుండటంతో అధికారులు ఆర్‌వోబీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. గత రెండు సంవత్సరాల కిందట లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్‌యూబీ నిర్మాణ పనులు చేపడుతామని రైల్వే అధికారులు తెలిపారు. ఉండవల్లి, అలంపూర్ మండల రైతులు, ప్రజా ప్రతినిధులు ఆర్‌యూబీకి బదులు ఆర్‌వోబీ నిర్మించాలని విన్నవించడంతో పనులు చేపట్ట లేదు.

అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి...

జోగుళాంబ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికుల రాకపోకలు పెరిగాయి. ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యాలను, స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నాం. సుమారుగా ఆరున్నర కోట్ల వ్యయంతో స్టేషన్‌ను ఆధునీకరించడంతో పాటు సరికొత్త హంగులతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. స్టేషన్‌కు వచ్చిన ప్రతి ప్రయాణికునికి ఆధ్యాత్మికత భావన కలిగే విధంగా స్టేషన్ గదులకు, గోడలకు అమ్మవారి చిత్రాలు, చరిత్రను తెలిపే చిత్రాలతో అద్భుత శిల్పకళను ఉట్టిపడే విధంగా పనులు చేపడుతున్నాం. మరో మూడు నెలల్లో పనులు తుదిదశకు చేరే అవకాశం ఉంది. ముఖ్యంగా వృద్ధులకు, మహిళలకు, వికలాంగులకు ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేస్తున్నాం.

– సురేష్‌కుమార్, ఏడీఈఎన్, కర్నూలు, ఎస్‌సీఆర్, హైదరాబాద్ డివిజన్

పాల డబ్బాకూ నోచుకోని పసికందులు



మహబూబ్‌నగర్‌లోని శిశు గృహ కేంద్రం

● శిశు గృహకు ఐదు నెలలుగా రాని నిర్వహణ నిధులు
● మంజూరు 20.. ప్రస్తుతం ఉన్న చిన్నారులు 34 మంది
● ఒక్కో చిన్నారికి నెలకు రూ.2,500 ఇస్తున్న కేంద్ర పభుత్వం
● పది రోజులకు మించి ఉండని ఆయాలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), డిసెంబరు 9: నిధుల కొరత, పరిమితికి మించి పిల్లలు ఉండటంతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిశు గృహ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముళ్ల పొదలు, డ్రైనేజీలు, ఆస్పత్రుల్లోని ఊయలలు, ఇతర ప్రాంతాల్లో వదిలేసి వెళ్లిన పసికందులను ముందుగా తెచ్చి శిశుగృహలో చేర్పుతారు. అక్కడ వారి బాగోగులు చూడటమే కాకుండా, పిల్లలు లేని వారికి దత్తత ఇస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఒక్కటే శిశు గృహ సంరక్షణ కేంద్రం ఉంది. కేంద్రంలో ప్రస్తుతం 34 మంది పిల్లలు ఉన్నారు. అందులో 12 మంది అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తుండగా, మిగతా వారు అక్కడే ఉంటారు. కేంద్ర ప్రభుత్వం ఈ కేంద్రానికి నిధులు ఇస్తోంది. ఒక్కో శిశువుకు నెలకు రూ.2,500 ఇస్తారు. అందులో ఒక మేనేజర్, ఒక డాక్టర్, ఒక నర్సు, ఆయాలు ఉంటారు.

భారంగా మారిన నిర్వహణ..

ప్రస్తుతం ఉన్న శిశు గృహకు కేంద్ర ప్రభుత్వం రెండు యూనిట్లను మంజూరు చేసింది. ఒక్కో యూనిట్‌లో 10 మంది చొప్పున రెండు యూనిట్లకు కలిపి 20 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం ఉన్న ఈ కేంద్రంలో రెండు యూనిట్లకు మించి 34 మంది పిల్లలు ఉన్నారు. 14 మంది పిల్లలు ఎక్కువ ఉన్నారు. అయితే ప్రభుత్వం ఒక్కొక్కరికి నెలకు రూ.2,500 చొప్పున 20 మంది పిల్లలకు కలిపి రూ. 50 వేలు మాత్రమే ఇస్తోంది. అదనంగా ఉన్న 14 మంది పిల్లలకు సంబంధించి నెలకు రూ.35 వేల భారం పడుతోంది. ఆ నిధులు అటు కేంద్రం గానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వం గానీ ఇవ్వడం లేదు. వచ్చిన నిధుల నుంచే సర్దుబాటు చేస్తున్నారు. దాంతో నిధులు చాలక నిర్వహణ భారంగా మారింది.

ఐదు నెలలుగా రాని నిధులు..

శిశు గృహ నిర్వహణకు కేంద్రం ప్రతీ నెల రూ.50 వేలు ఇస్తుండగా, ఐదు నెలలుగా రావడం లేదు. ఇప్పటి వరకు రూ.2.50 లక్షలు రావాల్సి ఉంది. అదేవిధంగా సిబ్బంది జీతాలు కూడా ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అప్పులు చేసి, శిశు గృహను నెట్టుకొస్తున్నారు.

జీతం తక్కువగా ఉండటంతో ముందుకు రాని ఆయాలు..

శిశు గృహలో చిన్నారుల ఆలనా పాలన చూసుకునేందుకు, వారికి పాలు పట్టించేందుకు, దుస్తులు ఉతికేందుకు ఆయాలు అవసరం అవుతారు. ప్రస్తుతం 34 మంది చిన్నారులకు ఆరు మంది ఆయాలు ఉన్నారు. వారికి నెలకు రూ.7,944 జీతం ఇస్తున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన వేతనం. అయితే పని ఎక్కువగా ఉండటం, వేతనం సరిపోవడం లేదని ఆయాలు పది రోజులు పని చేసి, మానేస్తున్నారు. కొత్త వారిని నియమించుకుందామంటే ఆ జీతానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఉన్నవారితోనే నెట్టుకొస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

శిశుగృహలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. కేంద్రం మొత్తం కంపుకొడుతోంది. అక్కడుండే పిల్లలు మాసిన బట్టలతో కనిపిస్తున్నారు. కనీసం డైపర్లు కూడా లేకుండా ఉన్నారు. పౌష్టికాహార లోపంతో బక్క చిక్కారు. వారి ఆలనా పాలన చూడటం లేదు. కేంద్రం భవనం పాతది కావడంతో వర్షాకాలం వచ్చిందంటే గోడల్లోంచి నీళ్లు కారుతున్నాయి. గోడలకు ఉన్న సిమెంటు, సున్నం రాలిపడుతోంది. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల శిశు గృహను పరిశీలించారు. చిన్నారుల దుస్థితిని చూసి చలించిపోయారు. అధికారులు కూడా ఈ కేంద్రాన్ని పట్టించుకోవడం లేదు.

వచ్చే ఏడాది ప్రతీ జిల్లాకు ఒక యూనిట్



శిశు గృహకు నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తాయి. ప్రస్తుతం 20 మందికి మాత్రమే నిధులు వస్తున్నాయి. అవి కూడా గత కొన్ని నెలలుగా రావడం లేదు. అదనంగా ఉన్న 14 మందికి బడ్జెట్ ఇవ్వడం, ఆయాల జీతాల పెంపు విషయం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉంటుంది. వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రతీ జిల్లాకు ఒక యూనిట్‌ను మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. అప్పుడు ఇతర జిల్లాల పిల్లలను అక్కడికి పంపే అవకాశం ఉంది. ఉన్నదాంట్లోనే అన్ని సౌకర్యాలు కల్పించే ఏర్పాట్లు చేస్తాం.

– జరీనా బేగం, జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి

నిప్పుతో ముప్పు



నారాయణపేట మండలం సింగారం శివారులో కాలుస్తున్న వరి కొయ్యలు

వరి కొయ్యలను కాల్చితే భూసారంపై దెబ్బ
పొలాన్ని కలియదున్నితే ప్రయోజనాలు
నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్

నారాయణపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరి పంట కోసిన తర్వాత కొయ్యలు కాల్చడం వల్ల భూ సారానికి దెబ్బ వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయంలో యాంత్రీకరణ పెరగడం, కూలీల కొరతతో వరి పంటను హార్వెస్టర్ మిషన్‌లతో కోయిస్తున్నారు. గడ్డి వినియోగం తగ్గిపోవడంతో పశు సంపద ఉన్నవారు మాత్రమే దానిని సేకరిస్తుండగా, మిగతవారు పొలాల్లోనే వదిలేస్తున్నారు. ప్రస్తుతం రబీ సాగు కోసం సమయత్తంలో భాగంగా వరి కొయ్యలతో పాటు పొలాల్లో గడ్డి ఉన్నవారు దానిని కాల్చేస్తున్నారు. ఇలా గడ్డిని, కొయ్యలను కాల్చేయడంతో ముప్పు పొంచి ఉందని నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ హెచ్చరిస్తున్నారు.



దుకం కోసం కరిగెట చేస్తున్న ట్రాక్టర్

నిప్పు పెట్టడంతో కలిగే నష్టాలు

వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. వేడితో భూమి సారం కోల్పోతుంది. నత్రజని, పాస్పరస్ వంటి పోషకాలు తగ్గడంతో పంట దిగుబడి పడిపోతుంది. భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయి. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతినడంతో పాటు పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి.

కలియ దున్నితే లాభాలెన్నో..

వరి కొయ్యలను నేలలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుల శాతం పెరిగి, పంట దిగుబడి పెరుగుతుంది. దుక్కి దున్నే సమయంలో సూపర్ పాస్పెట్ చల్లితే పంట అవశేషాలు రెండు వారాల్లో మురిగి, పోషకాలు అందుబాటులోకి వస్తాయి. దానివల్ల డీఏపీ వాడకం తగ్గుతుంది. మొక్కలకు రెండు శాతం నత్రజని, నాలుగు శాతం పాస్పరస్ అదనంగా ఇస్తుంది. జింక్, మంగనీసు, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మ ధాతువులు పంటకు మేలు చేకురుస్తాయి. గడ్డిని పది రోజుల ముందు పొలంలో పరిచి, నీటిని వదలాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పెట్ చల్లి, కలియ దున్నితే భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయి పెరిగి అధిక దిగుబడి వస్తుంది.

1,30,000 ఎకరాల్లో వరి

నారాయణపేట జిల్లాలో 4,11,194 ఎకరాల సాగు భూమి ఉంది. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 1,30,000 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు

మక్తల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ట్రైనీ కలెక్టర్ గరీమానరులా అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని కళాశాల మైదానంలో సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరకంగా ధృడంగా ఉంటారన్నారు. క్రీడా కోటలో ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్, ఎంఈవో అనిల్‌గౌడ్, పురపాలిక కమిషనర్ భోగేశ్వర్లు, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి, విశ్రాంత పీఈటీ గోపాలం, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ట్రైనీ కలెక్టర్

వైద్య రంగంలో పూర్తి సదుపాయాలు కల్పించండి

నర్సింగ్ కళాశాల భవన సముదాయానికి టెండర్లు పిలవండి
జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి సీటీ స్కానింగ్ యంత్రం ఇవ్వండి
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన పేట ఎమ్మెల్యే

నారాయణపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, జిల్లా ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వసతులు సమకూర్చాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను సోమవారం హైదరాబాద్‌లో పేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి కలిసి వినతిపత్రం అందించారు. రూ.26 కోట్లతో మంజూరైన నర్సింగ్ కళాశాల భవన సముదాయానికి టెండర్లు త్వరగా పిలిచి పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సిటి స్కానింగ్‌తో పాటు పూర్తి స్థాయిలో అధునాతన పరికరాలు ఉండేలా చూడాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు సమకూర్చి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా మౌలిక వసతులతో అన్ని ఏర్పాట్లు తీసుకోవాలని కోరారు.



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహను కలిసి వినతిపత్రం ఇస్తున్న నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

క్రైం కార్నర్

ఇద్దరు పోకిరీలకు జైలు శిక్ష

» అడిషనల్ ఎస్పీ సీహెచ్ రామేశ్వర్

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులను వేధిస్తున్న ఇద్దరు పోకిరీలకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు అడిషనల్ ఎస్పీ సీహెచ్ రామేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థినులను ఇద్దరు యువకులు వేధిస్తున్నట్లు షీటీంకు ఫిర్యాదు అందింది. దీంతో షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఉద్యోగి వెంకటయ్య నిఘా ఉంచి, ఇద్దరు యువకులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరు పరచగా, నిందితులకు ఏడు రోజుల జైలు శిక్ష, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

వంగూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఓ వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని శ్రీశైలం క్రాస్ రోడ్ వద్ద ఈనెల ఐదున డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా, తాడూరు మండలం సిర్సవాడ గ్రామానికి చెందిన కేశవులు మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం, పట్టుబడిన నిందితుడు

ఊట్కూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌బృందం పట్టుకున్నది. అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని నిడుగుర్తి గ్రామంలో ఓ వ్యక్తి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నాడని టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో సివిల్ సప్లై డీటీ కాళప్ప, ఊట్కూర్ పోలీసులతో గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ అనే వ్యక్తి ఇంట్లో ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించడంతో, స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు. ఎవరైనా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే పోలీసులు, అధికారులకు తెలపాలని గ్రామస్థులకు సూచించారు.

కొడుకును చూసేందుకు వచ్చిన వ్యక్తి అదృశ్యం



భరత్‌రావు

జడ్చర్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర రాష్ట్రం, బీడ్ జిల్లా, మజల్‌గావ్‌కు చెందిన భరత్‌రావు (49) ఈ నెల ఏడవ తేదీన అదృశ్యం అయ్యాడు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎస్‌ఐ శివానందంగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అభిలాష్ రెండు సంవత్సరాలుగా జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్ గడ్డ సమీపంలో నివాసం ఉంటున్నాడు. పోలేపల్లి సెజ్‌లోని ఓ ఫార్మా పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడిని చూసేందుకు అతడి తండ్రి భరత్‌రావు ఈ నెల ఏడున జడ్చర్లకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. గ్రామంలో వెతికినా కనిపించినా, ఆచూకీ లభించలేదు. అభిలాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ పట్టణంలోని జనరల్ ఆసుపత్రి పక్కనే ఉన్న గది వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) ఆదివారం రాత్రి మృతి చెందాడు. అతడికి రెండు చేతులూ లేవు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో సోమవారం సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అతడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే టూటౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ ఎజాజ్‌అహ్మద్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

అయిజ టౌన్, డిసెంబర్ 9, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణం, నర్సింహకాలనీలో ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన మౌలాలి ఆదివారం రాత్రి తన ఇంటి ముందు బైక్ పార్క్ చేశాడు. సోమవారం ఉదయం చూసే సరికి వాహనం కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామి పడిపూజ



గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

ఊట్కూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం లోని బిజ్వారం గ్రామంలోని శక్తి పీఠం ఆవరణలో సోమవారం అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శక్తి పీఠం స్వామి ఆదిపరాశ్రీ, గురుస్వాములు ఎం.భగవంతు, రఘువీర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో అయ్యప్ప స్వాములు కలశం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గణపతి, కుమారస్వామి, పడి పూజలు చేశారు. ఆ తర్వాత అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతం, కుంకుమ, చందన, పసుపు, భస్మాభిషేకాలు చేశారు. మహా మంగళహారతితో కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప శరణు ఘోషతో గ్రామం మారుమోగింది. కార్యక్రమంలో గురు స్వాములు శంకర్, హన్మంతు, వెంకటేశ్, శ్రీనివాస్, రాముగౌడ్, భానుచందర్‌లతో పాటు, వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుండుమాల్ శివారులో చిరుత సంచారం

కోస్గి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కోస్గి మండలం గుండుమాల్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి చిరుతపులి సంచరించింది. గ్రామస్థులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి. గుండుమాల్ నుంచి పగిడాల గ్రామానికి వెళ్లే మార్గంలో చిరుతపులి సంచ రించి, ఫయాజ్ అనే వ్యక్తికి చెందిన మేకను చంపింది. దీంతో భయాందోళనలకు గురైన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి లక్ష్మణ్‌నాయక్ సోమవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు కనిపించాయని, రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

కొడుకే ఆమె ప్రాణం

» పుట్టినప్పటి నుంచి మానసిక ఎదుగుదల లేని కుమారుడు
» 30 ఏళ్లుగా కంటికి రెప్పలా చూసుకుంటున్న తల్లి అయ్యమ్మ
» ఆమెకు రెండేళ్ల క్రితం కాలు విరిగి అప్పుల పాలు
» ఇద్దరికీ పెన్షన్ వస్తున్నా సరిపోక అవస్థలు
» దీనికి తోడు ప్రతీ నెల నాలుగు వేల రూపాయల మందుల ఖర్చు



కుమారుడు కృష్ణకు అన్నం తినిపిస్తున్న తల్లి అయ్యమ్మ

అయిజ టౌన్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి) : తొలి చూలులో పుట్టిన కొడుకు మానసికంగా ఎదగలేదు. ఎంత మంది వైద్యులకు చూపించినా ఫలితం లేకపోయింది. దీంతో మనో వేదనకు గురైన భర్త మరణించాడు. అయినా ఆమె కుంగిపోలేదు. కన్న ప్రేమతో కష్టాలను దిగమింగింది. అన్నీ తానే అయి కుమారుడిని ప్రాణానికి ప్రాణంగా కాపాడుకుంటోంది. అయిజ పట్టణం లోని కమతంపేట కాలనీకి చెందిన కుర్వ బుగ్గన్న, అయ్యమ్మ దంపతులకు 30 ఏళ్ల క్రితం మొదటి సంతానంగా కృష్ణ జన్మించాడు. తొలి కాన్పులో కుమారుడు పుట్టడంతో దంపతులిద్దరు సంతోషించారు. కానీ మూడు నాలుగు నెలలు గడిచినా శిశువులో మానసిక ఎదుగదల లేకపోవడంతో వారి కలలు కన్నీరయ్యాయి. అప్పటి నుంచి ఎంతో మంది వైద్యులకు చూపించారు. అయినా పరిస్థితిలో మార్పు కనిపించలేదు. దీంతో మనో వేదనకు గురైన భర్త బుగ్గన్న అనారోగ్యానికి గురై మరణించాడు. దీంతో అయ్యమ్మను మరిన్ని కష్టాలు చుట్టుముట్టాయి. ఏటికేడు కుమారుడి వయసు పెరుగుతోంది కానీ మాటలు రాలేదు. సొంతంగా ఏ పనులు చేసుకోలేడు. కాలకృత్యాలు కూడా తీర్చుకోలేడు. దీంతో ఆమె ఉదయం పళ్లు తోమి, స్నానం చేయించడం, అన్నం తినిపించడం, నీళ్లు తాగించడం.. ఇలా అన్నీ తానే అయ్యింది. కన్న కుమారుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటోంది.

వెంటాడుతున్న సమస్యలు

మానసికంగా ఎదుగుదల లేని కృష్ణను సంరక్షించుకోవడం అయ్యమ్మకు కష్టంగా మారింది. ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నా ఏదో ఒక సమస్య ఎదురవుతూనే ఉంది. ఆరు నెలల క్రితం ఆమె ఇంట్లో పనిలో ఉండగా, కృష్ణ ఒంటరిగా రోడ్డుపైకి వచ్చాడు. దారివెంట వెళ్తుండగా కుక్కలు వెంట పడి కరిచాయి. స్థానిక యువకులు గమనించి, కుక్కలను తరిమేసి అతడిని కాపాడారు. ఇంటికి తీసుకొచ్చి తల్లికి అప్పగించారు. ఆమె ఓ మనిషిని వెంట పెట్టుకొని కృష్ణను మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించింది. ఇంజక్షన్లు, మందులు ఇప్పించింది. కాలిలో రాడ్డు ఉండటంతో తీవ్రమైన నొప్పి వస్తోందని, అలాగే కొడుకుకు సేవలు చేస్తున్నానని ఆమె తెలిపింది. ఒక వైపు కొడుకును చూసుకుంటూ, మరొక వైపు ఇంటి పనులను చేసుకోవడంలో సతమతం అవుతున్నానని చెప్తోంది. కంటికి రెప్పలా కాపాడుకుంటున్నా, ఏదో ఒక సమస్య ఎదురవుతోందని అంటోంది.

లక్షల రూపాయలు ఖర్చు చేసినా..

కుమారుడు కృష్ణకు చిన్న వయసులోనే చికిత్స చేయిస్తే బాగవుతుందని ఇరుగు పొరుగు వారు చెప్పిన మాటలు ఆమెలో ఆశలు రేకెత్తించాయి. అతడిని తిరుపతి, వడ్డెమాన్, కర్నూలు, పెంట్లవెల్లి తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి చికిత్సలు చేయించింది. అందుకోసం ఇప్పటివరకు దాదాపు ఐదు లక్షల రూపాయలను ఖర్చు చేసింది. అయినా పరిస్థితి ఇంత కూడా మారలేదు. ఒక వైపు మానసిక దివ్యాంగుడైన కుమారుడు, మరో వైపు కట్టుకున్న భర్త మరణంతో ఆమె తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సెంటు భూమి కూడా లేని ఆమెకు రోజు గడవడమే కష్టంగా మారింది. అయినా అయ్యమ్మ అష్ట కష్టాలు పడుతూ కుమారుడి ఆలనా పాలనా చూసుకుంటోంది.

కాలు విరిగి నడవలేని స్థితి..

అసలే ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న అయ్యమ్మ, రెండేళ్ల క్రితం వండి వార్చిన గంజిని ఆరుబయట పారబోసేందుకు వస్తుండగా ఇంటి గుమ్మ వద్ద స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమె కుడి కాలు రెండు చోట్ల విరిగిపోయింది. చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి వెళ్లగా, కాలికి రెండు రాడ్లు అమర్చారు. అందుకోసం లక్షన్నర రూపాయలు అప్పు చేయాల్సి వచ్చింది. పైగా ఈ ఏడాది అక్టోబర్ వరకు మంచానికే పరిమితం కావాల్సి వచ్చింది. కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్నప్పుడు కుమారుడి బాగోగులు చూసుకునేందుకు పని మనిషిని ఏర్పాటు చేసుకున్నది. కానీ ఎవరూ స్థిరంగా ఉండి పని చేయలేదు. దీంతో కాలి నొప్పితో బాధపడుతూనే, స్ట్రెచర్ సాయంతో కొడుకు ఆలనా పాలన చేసుకున్నది.

ఇద్దరికి వచ్చే పింఛన్లే జీవనాధారం

మానసిక దివ్యాంగుడి కోటాలో కుమారుడికి ప్రతీ నెల నాలుగు వేలు, వితంతు కోటాలో ఆమెకు వచ్చే రెండు వేల రూపాయలే వారికి జీవనాధారం. వచ్చిన డబ్బులో నాలుగు వేలు తన మందుల ఖర్చు పోను, మిగిలిన రెండు వేల రూపాయల్లో ఇద్దరూ జీవనం సాగించాల్సి వస్తోంది. ఆ డబ్బుతో నెల గడవడం కష్టంగా ఉందని అయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. అంతే కాకుండా వారు నివసిస్తున్న ఇల్లు శిథిలావస్థలో ఉంది. మట్టి మిద్దె కావడంతో వర్షం వచ్చినప్పుడు పైకప్పు కురుస్తోంది. దీంతో ప్రతీ వానా కాలం తీవ్రంగా ఇబ్బంది పడ్తున్నామని ఆమె వాపోతోంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని, కుమారుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరుకుంటోంది.

నేడు భగవద్గీత కంఠస్థ పోటీలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ మహబూబ్‌నగర్ కార్యాలయ ఈవో ఉత్తరాపల్లి రామాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థుకు ప్రథమ విభాగం, ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు ద్వితీయ విభాగంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అయోధ్యలో అద్భుత నృత్య ప్రదర్శన

» ప్రశంసలు అందుకున్న మక్తల్ చిన్నారులు

మక్తల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణానికి చెందిన చిన్నారులు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. మక్తల్ పట్టణంలోని ఆద్య నృత్యాలయ విద్యార్థులు సప్తశ్రీరెడ్డి, ఆద్య, బృంద, ప్రవత్య క్రితి, హాసిని, అనన్య, శరణ్య అక్షితలు నాట్య గురువు హారతీజోషి ఆధ్వర్యంలో నృత్య సాధన చేస్తున్నారు. వారు అయోధ్య క్షేత్రంలో ఆదివారం రాత్రి అద్భుతమైన నృత్యం ప్రదర్శించి అందరి అభినందనలు పొంది, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా గురువు హారతీ జోషి మాట్లాడుతూ పవిత్ర పుణ్య క్షేత్రంలో తమ విద్యార్థులు ఇతిహాసాలకు సంబంధించిన అంశంపై నృత్య ప్రదర్శన ఇవ్వడం మంచి అనుభూతి కలిగించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పసుల రంజిత్‌రెడ్డి, మానస, దినేశ్, వాణి, రాధ, సబిత, అరుణ, అలేఖ్య, అంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు.



నిర్వాహకుల నుంచి మెమొంటోను అందుకుంటున్న నాట్య గురువు హారతీ జోషి, నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులు

ప్రజాపాలన చూసి ఓర్వలేకే విమర్శలు

» రాష్ట్రంలో 160 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం » టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు సీజే బెనహర్, మల్లేశ్

మహబూబ్‌నగర్, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజా పాలనకు ప్రజలు ఆకర్శితులై రేవంత్ సర్కార్‌కు అండగా నిలబడుతుంటే చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి హరవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ సర్కార్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు 160 సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏక కాలంలో రుణమాఫీ చేయడంతో పాటు సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. సన్న ధాన్యం పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నారన్నారు. రైతు భరోసా, బోనస్‌లతో రైతులపై పెట్టుబడి భారం తగ్గుతోందన్నారు. పాలమూరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాకు రూ.15 వేల కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. నారాయణపేట - కొడంగల్ ఎత్తి పోతల పథకంతో పాటు పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రణాళికను రూపొంది స్తున్నట్లు చెప్పారు. వెనకబడ్డ ప్రాంతమైన కొడంగల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలి పారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటే బీఆర్‌ఎస్, బీజేపీలకు కడుపుమంటగా ఉందని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు సీజే బెనహర్, మల్లేశ్ పాల్గొన్నారు.

కేసీఆర్ పోరాటం వల్లే

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

» హామీలను మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం
» 'దీక్షా దివస్'లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

వనపర్తి అర్బన్/గోపాల్‌పేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటం వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. దీక్షా దివస్‌ను పురస్కరించుకొని వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో సోమవారం ఆయన తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరి దయాదాక్షిణ్యాలతో రాష్ట్రం రాలేదని, కేసీఆర్ పోరాటం వల్లనే తెలంగాణ సాకారం అయ్యిందన్నారు. రాష్ట్ర ఏర్పాటు ప్రకటన వచ్చిన డిసెంబర్ తొమ్మిదిన దీక్షా దివస్‌ను జరుపుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలు ఇక సాగవని, మరోమారు కేసీఆర్ ఆధ్వర్యంలో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హామీలు నేరవేర్చకపోతే తొందరలోనే కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అనంతరం అంబేడ్కర్, జ్యోతిబాఫూలే, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆ తర్వాత మున్ననూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన కార్యకర్తలు వెంకటయ్య, చిట్టెమ్మల కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున బీమా చెక్కులను అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ ఎంపీపీ సంధ్య తిరుపతి యాదవ్, బీఆర్‌ఎస్ మీడియా సెల్ కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

బస్సులో ల్యాప్‌టాప్‌ను మరిచిన ప్రయాణికుడు



శ్రీరాములుకు ల్యాప్‌టాప్‌ను అందిస్తున్న కంట్రోలర్ నిరంజన్

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు తన ల్యాప్‌టాప్‌ను మరిచిపోయారు. కంట్రోలర్ చొరవతో, డ్రైవర్, కండక్టర్ల సహకారంతో దానిని తిరిగి అతడికి అప్పగించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి బస్టాండ్ కంట్రోలర్ నిరంజన్ తెలిపిన వివరాలా ఉన్నాయి. వనపర్తి డిపోకు చెందిన లింగాలకు వెళ్లే బస్సులో శ్రీరాములు అనే ప్రయాణికుడు సోమవారం ఉదయం 8.30 గంటలకు ఎక్కాడు. ఏదుల మండల కేంద్రంలో ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్‌ను బస్సులోనే మరచి పోయి దిగి వెళ్లిపోయాడు. గంట తరువాత గుర్తుకు వచ్చిన శ్రీరాములు ఆందోళనకు గురయ్యాడు. వెంటనే బైక్‌పై పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి చేరుకున్నాడు. బస్‌స్టాప్‌లో డ్యూటీలో ఉన్న కంట్రోలర్ నిరంజన్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో వనపర్తి డిపోకు ఫోన్ చేసి లింగాల రూట్‌లో వెళ్లిన బస్సు కండక్టర్, డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయాన్ని తెలిపారు. దీంతో వారు బస్సును ఆపి వెతకగా ల్యాప్‌టాప్ బ్యాగు దొరకడంతో కంట్రోలర్‌కు సమాచారం అందించారు. ఆ బస్సు తిరిగి పెద్దకొత్తపల్లికి రాగానే ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్న కంట్రోలర్ బాధిత ప్రయాణికుడు శ్రీరాములుకు అప్పగించాడు. చొరవ చూపిన కంట్రోలర్, సహకరించిన డ్రైవర్, కండక్టర్లకు అతడు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు కార్లు ఢీ, ఒకరి మృతి

» నలుగురికి గాయాలు » మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన వ్యక్తి

నర్సాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో నలుగురు గాయపడ్డారు. మెదక్ - హైదరాబాద్ జాతీయ రహదారిపై నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తికి చెందిన అధ్యాపకుడు బింగి శ్రీకాంత్(30) స్నేహితులు శివరాములు, యాదగిరి, శివకృష్ణ, రాఘవేంద్రలతో కలిసి కారులో ఏడుపాయల దేవస్థానానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం వనపర్తికి తిరుగు ప్రయాణమయ్యారు. నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని జల హనుమాన్ మలుపు వద్ద హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన ఇన్నోవా, వీరి కారును ఢీకొన్నది. ప్రమాదంలో శ్రీకాంత్ అక్కడిక్కడే మృతి చెందాడు. మిగతా నలుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. శ్రీకాంత్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఇన్నోవా కారును నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ హుస్సేన్‌పై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పేట' మార్కెట్‌కు వెయ్యి క్వింటాళ్ల కందులు

నారాయణపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 1068.20 క్వింటాళ్ల ఎర్ర కందులు విక్రయానికి వచ్చాయి. క్వింటాల్‌కు గరిష్ఠం రూ.11,435, కనిష్ఠం రూ.7,929 ధర పలికింది. సగటున రూ.10,388 ధర లభించింది. 279.79 క్వింటాళ్ల తెల్ల కందులు విక్రయానికి రాగా, క్వింటాలుకు గరిష్ఠం రూ.11,459 కనిష్ఠ ధర రూ.8,809, సగటున రూ.11,388 ధర పలికింది. వడ్లు హంస రకం క్వింటాలుకు గరిష్ఠం రూ.2,813, కనిష్ఠం రూ.1,261, సగ టున రూ.2,473 ధర పలికింది. వడ్లు సోనా క్వింటాలుకు గరిష్ఠం రూ.2,756, కనిష్ఠం రూ.1,500, సగటున రూ.2,691 ధర పలికింది.

ఇంటర్వ్యూ..

సింగిల్‌విండో అభివృద్ధికి కృషి

» సింగిల్ విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్



చారకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో రుణాలు, రాయితీ విత్తనాలు, ఎరువులు అందించి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని సింగిల్‌విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ సోమవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు ఏవిధంగా కొనసాగుతున్నాయి?

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తూ సన్నాలకు రూ. 500 బోనస్ కల్పిస్తుంది. రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే 1,300 క్వింటాళ్ల వడ్లను కొన్నాం.

ఎంతమంది రైతులకు ఏఏ రుణాలు ఇచ్చారు?

సొసైటీలో 4,430 మంది రైతులు ఉన్నారు. పంట రుణాలు రూ.7కోట్లు, దీర్ఘ కాలిక రుణాలు రూ.3.23 కోట్లు ఇచ్చాం. 293 మందికి ప్రభుత్వం రూ. 1.75 కోట్లు రుణమాఫీ చేసింది. నాబార్డు నిధుల నుంచి 2023-24 వరకు రూ.20 లక్షలు పంట రుణాలు ఇవ్వడం జరిగింది.

సింగిల్‌విండో అభివృద్ధికి ఎలాంటి కృషి చేస్తున్నారు?

చారకొండలో సహకార సంఘం ఏర్పడి 35 ఏళ్లు అవుతుంది. రూ. 7 కోట్ల వరకు రుణాలను రైతులకు అందజేస్తున్నాం. రూ.30లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంను నిర్మించాం. సొసైటీకి రెండు ఎకరాల భూమి కావాలని కలెక్టరుకు నివేదించాం.

న్యూస్ బాక్స్

ఈపాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు చేయాలి

తిమ్మాజిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతుకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు అమ్మాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల రికార్డులను అదేవిధంగా గోదాంలో నిల్వ ఉన్న ఎరువులను ఈ పాస్ మిషన్‌ను పరిశీలించారు.

మేటీ మాస్టర్‌ను కేటాయించాలి

తెలకపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఎన్నో సంవత్సరాల నుంచి సీనియర్ మేటీలుగా కొనసాగుతున్న వారికి కనీసం మేటీ మాస్టర్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. చిన్నరాయుడు, బాలస్వామి, పరశురాములు తదితరులు ఉన్నారు.

ఆదివాసీ చెంచుల కోసమే పీసా చట్టాలు

పదర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి చెంచుల కోసమే పీసా చట్టాలని ఆదివాసి అటవీ హక్కుల చెంచు సంఘం మండల అధ్యక్షుడు మండ్లి చిన్న అంజయ్య తెలిపారు. సోమవారం చెంచు పెంటల్లో గూడెం కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలోని పట్టెరూట్ పెంట, ఇప్పలపల్లి, మారెడుగు, బాపన్‌పాడు, ఉడిమిల్ల, పెట్రాల్‌చేనులో కమిటీ వేసినట్లు తెలిపారు. భవిష్యత్ కార్యచరణ త్వరలో వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మండ్లి సోమయ్య, కార్యదర్శి చిగుర్ల హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం

బల్మూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ అమలు పరిచే వరకు పోరాడుతామని మాలల చైతన్య సమితి మండల అధ్యక్షుడు పెరుమాళ్ల రవికుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి అనంతరం వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మూలే కేశవులు, నియోజకవర్గ అధ్యక్షుడు పంబ వెంకటస్వామి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌ల సమక్షంలో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. కృష్ణయ్య, గణేష్, మల్లేష్, రఘుపతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

పదర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆయన మండలంలోని విలేకరులతో మాట్లాడుతూ.. డీలర్లుకు సరైన గౌరవ వేతనంతో పాటు కమీషన్లు గిట్టుబాటుగా అందించేలా ప్రభుత్వం త్వరగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. తమ సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు.

విద్యార్థులకు తరగతి గదుల కొరత

» ఒకే గదిలో రెండు పాఠశాలల విద్యార్థులకు బోధన
» ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కరువు
» అసంపూర్తిగా పాఠశాల భవనాలు



కోడేరు మండల కేంద్రంలో బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టిన ఉపాధ్యాయులు

కోడేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ పాఠశాలలో పరిసితులు మారడం లేదు. మన ఊరు మన బడి కార్యక్రమం కింద పాఠశాలల్లో గదుల నిర్మాణం కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఎంతో ఆర్భాటంగా భవనాల నిర్మాణం చేపట్టారు. కానీ నిధుల లేమితో భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. ఈ పథకం కింద మండలానికి రూ.1.4 కోట్లు మంజూరయ్యాయి. బాలుర ప్రాథమిక పాఠశాలకు రూ.34. 56లక్షలు, బాలికల ప్రాథమిక పాఠశాలకు రూ.11,3,381, కొండ్రావుపల్లి ప్రాథమిక పాఠశాలకు రూ.11,36,129, రాజాపూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.3,64,675, ఎత్తం ప్రాథమిక పాఠశాలకు రూ.11,33,700 అదనపు గదుల కోసం మంజూరయ్యాయి. కానీ పాఠశాల భవన నిర్మాణాలు నిధుల లేమితో అసంపూర్తిగా మిగిలాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి పాఠశాలలో మౌలిక వసతుల కోసం మండలానికి రూ. 16లక్షల మంజూరు చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు జనుంపల్లి, తీగలపల్లి, పసుపుల, ఖానాపూర్, కోడేరు, హరిజనవాడ, కోడేరు గుట్ట, కోడేరు వడ్డెవాడ, నాగులపల్లి తండా, రాజాపూర్, బాడుగదిన్నె, నర్సాయిపల్లి పాఠశాలలను ఎంపిక చేశారు. కొన్ని పాఠశాలలో నేటికి పనులు ప్రారంభించ లేదు. గదులు పూర్తి కాకపోవడంతో పాఠశాలలో విద్యార్థులకు వసతులు లేక మండల కేంద్రంలో బాలుర, బాలికల పాఠశాలలో నిర్మాణం కాకపోవడంతో విద్యార్థులను ఒకే గదిలో కూర్చబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. బాలుర పాఠశాలలో 53, బాలికల పాఠశాలలో 58 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

» అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. అంతకముందు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో కొత్తగా వచ్చిన 108 అంబులెన్సును డీఎం హెచ్‌వో స్వరాజ్యలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించి అంబులెన్సును నడిపారు. కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గీత కార్మి కులకు కాటమయ్య రక్షణ కిట్లను అందజేశారు. అనంతరం తహసీల్దార్ సునీతతో కలిసి కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. వెంకట్‌గౌడ్, మహేందర్, బాల్‌రాంగౌడ్, గ్యార లక్ష్మణ్, జైపాల్, అంజయ్య, నాగేందర్, నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పంటను పరిశీలిస్తున్న అధికారి భరత్‌కుమార్

లింగాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణాధికారి భరత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని రాయవరంలో పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వేరుశనగకు లద్దెపురుగు ఆశించి నష్టపరుస్తుందన్నారు. దీని నివారణ స్పైనోసాడ్ 60మి.లీ. ఎకరాకు సాయంత్రం వేళల్లో పిచికారి చేసుకోవాలన్నారు. మచ్చ తెగుళ్లు ఉన్నందున టెబుకెనజోల్ 250మి.లీటర్లు ఎకరాకు, 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

» పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించ తలపెట్టిన సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్ ఆవరణంలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడుతూ రాజ్యాంగం కోరుకుంటున్న ప్రజాస్వామ్య, గణతంత్ర విలువలను సమూహ సెక్యులర్ రైటర్స్ కాపాడాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాలు, పార్టీలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసే మతతత్వ రాజకీయాలు చేయడం ఈ దేశ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని కవి సమ్మేళనంలో వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కవులు, మేధావులు నిరంజన్, జెట్టిధర్మరాజు, అబ్దుల్లా ఖాన్, లక్ష్మణ్‌నాయక్, టీ.మద్దిలేటి, ఆర్.శ్రీను, మోహన్, దినకర్, వనపట్ల సుబ్బయ్య, కాశన్న, రఘు, రాములు గౌడ్, ఎంఏ.గఫార్, కాశీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వారధిగా జర్నలిజం నిలవాలి

» టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా జర్నలిజం నిలవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నియోజవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందు యాదగిరి, ప్రధాన కార్య దర్శిగా సాయిలుసాగర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎండీ. దర్వేష్ ఖాద్రి, హౌసింగ్ ఇన్‌చార్జిగా దినా కర్, కోశాధికారిగా రమేష్, ఉపాధ్యక్షులుగా దిలీప్, శ్రీరాములు, రాంప్రకాష్, జాయింట్ సెక్రటరీలుగా ఎండీ.నజీర్ అహ్మద్, బంగారయ్య నరేందర్, లీగల్ అడ్వయిజర్‌గా రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం యూనియన్‌లో కొత్తగా చేరిన 93 మంది జర్నలిస్టులకు సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో రాములునాయక్, విజయ్‌కుమార్, మోహన్, వెంకటస్వామి, రాంరెడ్డి, శ్యామ్, మాధవరెడ్డి, పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ విద్యార్థి ప్రతిభ చాటాలి

తిమ్మాజిపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి పాఠశాలల్లో నిర్వహించే పోటీ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని ఎంఈవో సత్యనారాయణశెట్టి అన్నారు. తెలంగాణ బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో సోమవారం ఆవంచ, మారేపల్లి, గొరిట, చేగుంట, తిమ్మాజిపేట జడ్పీహెచ్‌ఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదివే పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. ప్రతిభను చాటి విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

కోడేరు: విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయటం వారి భవిష్యత్‌కు బాటలు వేయడం ఉపాధ్యాయుల కర్తవ్యమని కోడేరు జడ్పీహెచ్‌ఎస్ హెచ్ఎం సుధారాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయి జీవశాస్త్ర టాలెంట్ టెస్టు నిర్వహించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్టులో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ప్రతిభను కనబరిచారు.

లింగాల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బయో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. లింగాల, అంబటిపల్లి, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకులం, బాలికల ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు ఇన్‌చార్జి హెచ్ఎం కొండయ్య తెలిపారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కల్వకుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మిలినియం స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి కరాటే పోటీలల్లో ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ రేణుదర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో దక్కన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శివగణేష్, హరిచరణ్ స్పైరింగ్ విభాగంలో పతకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సోమవారం సత్కరించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

బిజినేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సాయంత్రం వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, బీమా పత్రాలను పరిశీలించి మాట్లాడారు. అతివేగంగా, రాంగ్ రూట్‌లో నడిపితే కేసు నమోదు చేస్తామన్నారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పూరి గుడిసె దగ్ధం

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవుని తిరుమలాపూర్‌లో గువ్వలి లక్ష్మయ్యకు చెందిన పూరి గుడిసెకు అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సోమవారం నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. బైక్, మంచంతో సహా పూర్తిగా కాలిపోయింది. దీంతో రూ.60వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

ఊర్కొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం అసెంబ్లీ ముట్టడి పిలుపు మేరకు మండలంలో ఉన్న మాజీ సర్పంచులను సోమవారం పోలీస్‌స్టేషన్ తరలించారు. అనంతరం వారి సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో కొమ్ము రాజయ్య, ఆంజనేయులు, సుదర్శన్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన సభ్యులు

కల్వకుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ ఢిల్లీలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒకే దేశం ఒకే ఎన్నికపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను కేంద్రమంత్రి ఆవిష్కరించినట్లు శివకుమార్ తెలిపారు. ఆయన వెంట మౌలి కిశోర్ ఉన్నారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



అచ్చంపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, నాయకులు

అచ్చంపేటటౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఐఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో సోనియా గాంధీ జన్మదినం వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

కల్వకుర్తి: సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో స్థానిక నాయకులతో కలిసి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ కేక్ కట్ చేసి పంచి పెట్టారు.

తిమ్మాజిపేట: సోనియాగాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో చిత్రపటం ఏర్పాటు చేసి నాయకులు కేక్ కట్ చేశారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి చేశారు.

కొల్లాపూర్: సోనియా గాంధీ జన్మదిన వేడుకలను పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మునిసిపల్ చైర్మన్ మేకల రమ్య, కౌన్సిలర్లు కట్ చేశారు. అదేవిధంగా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

చారకొండ: మండలంలోని జూపల్లిలో డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు.

పెద్దకొత్తపలి: సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మైసమ్మ అమ్మవారిని మాజీ ఎంపీపీలు సూర్యప్రతాప్‌గౌడ్, వెంకటేశ్వర్‌రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు దర్శించుకున్నారు.

క్రీడలతో జాతీయ స్థాయి గుర్తింపు



కొల్లాపూర్‌లో పోటీలను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, పీఈటీలు

» మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య

కొల్లాపూర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణిస్తే జాతీయ స్థాయి గుర్తింపు పొందుతారని ఉన్నత అవకాశాలు దక్కుతాయని మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియం ఆవరణంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సీఎం కప్ ఆటల పోటీలను మునిసిపల్ చైర్ పర్సన్ ప్రారంభించారు. క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసన్, ఎంపీడీవో మనోహర్, ఎంఈవో ఇమ్మాన్యుయేల్, కౌన్సిలర్ షేక్ రహీంపాషా, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడూరు: సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాలని ఎంపీడీవో బ్రహ్మచారి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మంగళవారం జరిగే పోటీలకు సంబంధించిన ఆటస్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం వాలీబాల్, బుధవారం కబడ్డీ, గురవారం ఖోఖో పోటీలను నిర్వహిం చనున్నామన్నారు. మండల స్థాయిలో కార్యదర్శులు క్రీడాకారులు పాల్గొనేలా శ్రద్ధ వహించాలన్నారు.

మన్ననూర్: మన్ననూరు గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో గ్రామస్థాయి క్రీడలను సోమవారం నిర్వహించారు. విజేతలను హెచ్ఎం సిద్దార్థ మహాదేవ్ అభినందించారు.

'ప్రజావాణి' సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ సీతారామారావు
» కలెక్టరేట్ ప్రజావాణికి 39 వినతులు



ఫిర్యాదు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కే.సీతారామారావు అధికారులకు ఆదేశించారు. ఈ వారం కలెక్టరేట్ ప్రజావాణికి 39 వినతులు వచ్చాయి. కోర్టు కేసులు ఉన్న వినతులు మినహా జిల్లా స్థాయి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడంతో పాటు క్షేత్ర స్థాయి సమస్యలను సంబంధిత మండలాలకు బదిలీ చేసి పరిష్కారమయ్యేదాక పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి చంద్రశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

» అదనపు కలెక్టర్ దేవసహాయం



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ నెల 15, 16 తేదీల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయం అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో 32 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 9,731 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. కేంద్రాల పరిధిలో అవసరమైన పోలీసు బందోబస్తు, వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, ఆర్టీసీ, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని ఆందోళన



అచ్చంపేటలో ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేసిన కార్యదర్శులు

అచ్చంపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులకు సమగ్ర సర్వేలో పనిభారం తగ్గించాలని సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిరసన తెలిపి అనంతరం ఎంపీడీవో మధుసూదన్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులు లక్ష్మణ్, శ్రీకాంత్, విజయ్, లక్ష్మి, శ్వేత పాల్గొని మాట్లాడారు. ఇటీవల గ్రామాలలో జరిగిన సర్వేను డేటా ఎంట్రీ పనులను పరిశీలనతో పాటు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే పనులను కార్యదర్శులకు అప్పజెప్పడం సరైంది కాదన్నారు. అధికారులు తక్షణమే ఆలోచించి కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని కోరారు.

పెంట్లవెల్లి: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వకుండా మినహాయించాలని కార్యదర్శుల సంఘం నాయకుడు గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో దేవేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అశ్విని, శ్రావణ్, దామోదర్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

» వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి



మార్కెట్ సిబ్బందితో మాట్లాడుతున్న వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి

కల్వకుర్తి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌ను, రికార్డులను పరిశీలించారు. మార్కెట్‌లో రైతులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రజలను నట్టేట ముంచేందుకు కాంగ్రెస్ కుట్ర

» మునిసిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్



మాట్లాడుతున్న నర్సింహగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు

అచ్చంపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను నట్టేట ముంచడానికి సీఎం రేవంత్ రెడ్డి కంకణం కట్టుకొని పనిచేస్తున్నారని మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ఆరు గ్యారెంటీలతో ఓటర్లను మోసం చేసి గద్దెనెక్కారన్నారు. గత ప్రభుత్వంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ రూ.లక్ష ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తులం బంగారం అదనంగా ఇస్తామని చెప్పి ఆడబిడ్డలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో రమేష్‌రావు, శంకర్, అమీనోద్దిన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.